

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**రైల్లో వెళుతున్న** రాజేష్ మనస్సులో ఆ తర్వాత చరణాన్ని పాడుకుంటున్నాడు.

మృత్యు హరణం రామ చరణం

దుఃఖ హరణం రామబాణం

నాకిష్టం. నాకిష్టం ఇవి నాకిష్టం.

కంట్లో నలకపడ్డట్టుగా, రుమాలుతో తన కంట్లోని నీటిని ఎవరూ గమనించకుండా తుడిచేసుకున్నాడు రాజేష్. అందరి ముందు ఏడవటం చాలా అమర్యాద అని తల్లి బోధించిన సంగతి రాజేష్ జీవితంలో మరవలేదు.

ఎంతో ఆనందంగా, ఎంతో సోమరిపోతుగా గడిపే రోజులు సంపాదించుకోవాలంటే మనిషి, హనీమూన్‌కి వెళ్ళి తీరాలి.

హనీమూన్‌లో సాంబశివరావు, నీరజ ఆనందంగా, సోమరిపోతులుగా కాలం గడిపేస్తున్నారు.

శోభనం అయిన మర్నాటి రాత్రి వీడియో కోచ్‌లో తెలుగు నవదంపతులు హనీమూన్ సిటీ బెంగుళూరు చేరుకున్నారు. కెంపగుడ సర్కిల్‌లో వున్న ఓ హోటల్‌లో గది తీసుకున్నారు.

మొదటి రెండు రోజులు ఇద్దరూ భోజనానికి తప్ప బయటికి రాలేదు. మూడోరోజు భోజనానికి కూడా బయటికి రాలేదు. గదికే తెప్పించుకున్నారు.

నాలుగోరోజు ఇద్దరికీ అనిపించింది బయటకు వెళ్ళాలని. బెంగుళూరు నగరాన్ని తిప్పి చూపించే టూరిస్ట్ కోచ్ అప్పటికి వెళ్ళిపోయింది.

ఆ హోటల్‌లో వున్న టూరిస్టు సర్వీసు వాళ్ళ దగ్గరకు వెళ్ళారు. మర్నాటికి రెండు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు.

ఒకరి చేతిలో మరొకరి చేతిని వుంచి నడుచుకుంటూ దగ్గరలో వున్న హోటల్‌కి వెళ్ళి బ్రేక్ ఫాస్ట్ తీసుకున్నారు. సాంబశివరావు భార్యతో చెప్పాడు.

"మనలాంటి వాళ్ళమీద జోక్ తెలుసా?"

"చెప్పండి."

"ఒకే పందిట్లో అక్కాచెల్లెళ్ళిద్దరికీ ఒకే ముహూర్తానికి వివాహాలయ్యాయి. అక్కయ్య చెల్లెల్ని మూడు రోజుల తర్వాత కాజువల్‌గా అడిగింది. మీ ఆయనకు గురకపెట్టే అలవాటుందా అని. చెల్లెలు సిగ్గుపడుతూ చెప్పింది. తెలీదు మాకు పెళ్ళయి ఇంకా మూడురోజులేగా."

"హనీమూన్ అంటే నవ్వులు, ఆనందం, పరోక్షంగా బంధు మిత్రుల పరిచయాలు, ఇష్టాలు, అయిష్టాల గురించిన సమాచారం ఎక్ఛేంజ్, జీవితంలో ఎదురయిన బలమైన సంఘటనల్ని ఒకరికొకరు తెలియచేసుకోవటం, భవిష్యత్తు గురించిన అనేక బంగారు పగటి కలలు, వాగ్దానాలు వినోద సాధనాలు, మంచి భోజనం, తక్కువ నిద, ప్రపంచంలో ఏ జంట హనీమూన్ చరిత్ర అయిన యిలాగే సాగాల్సిందే"

"నువ్వు సైకాలజీలో పోస్టు గ్రాడ్యుయేట్ వన్న సంగతి మరిచిపోయాను" నవ్వాడు సాంబశివరావు.

"ఎం.ఫిల్ కూడా అయింది. ప్రస్తుతం రీసెర్చ్ స్టూడెంట్ని."

"ఏ సబ్జెక్ట్ మీద?"

"చైల్డ్ సైకాలజీ."

"త్వరలోనే డాక్టర్ అవుతావన్నమాట."

"అవ్వాలనే ప్రయత్నం."

ఇద్దరిమధ్యా కాసేపు నిశ్శబ్దం.

"చైల్డ్ సైకాలజీ అంటే? దేన్ని గురించి?"

"ఎక్కువమంది తోడబుట్టిన వాళ్ళున్న పిల్లల మనస్తత్వం ఎలా ఉంటుంది అన్న అంశం పరిశోధిస్తున్నాను. అలాంటి వాళ్ళు తల్లిదండ్రుల ప్రేమని మిగతా వాళ్ళతో పంచుకోవాలి. కొందరికి తల్లిమీద అటాచ్మెంట్ కలిగితే, కొందరికి తండ్రి మీద కలుగుతుంది. మరికొందరికి ఆ ఇద్దరి మీద సమానంగా వుంటే, మరికొందరికి అసలు ఆ యిద్దరిమీద ప్రేమ ఉండదు. మానసికంగా అనాథల మనస్తత్వంతో పెరుగుతుంటారు అసూయతో ఇలాంటి అనేక పాయింట్స్ మీద."

"ఈ కాలంలో అధిక సంతానం అరుదైన విషయం కదా?"

"ఉహూం ఇద్దరు లేక ముగ్గురితో ఆగేవారి శాతం వర్కింగ్ క్లాస్లోనే అధికం. కొందరు కొడుకు పుట్టాలని ఎంతమంది కూతుళ్ళు పుట్టినా ఆపరేషన్ చేయించుకోరు. కొందరికి ఆపరేషన్ అంటేనే భయం. ఇంట్లో పెద్దవాళ్ళు యిష్టపడక కొందరు గర్భ నిరోధానికి ఎలాంటి ప్రయత్నాలు చెయ్యరు."

"మీ ప్రొఫెసర్ ఎలాంటాయన?"

"నైస్"

"థీసిస్ వర్కు ఎంతవరకు వచ్చింది?"

"సగం కన్నా కొద్దిగా తక్కువ. ఫీల్డ్ కెళ్ళి ఎక్కువ సంతానం వున్నవాళ్ళ పిల్లలనుంచి కొన్ని ప్రశ్నలకి సమాధానాలు రాబట్టాలి. క్వశ్చనీర్ తయారు చేశాను. అది మా ప్రొఫెసర్ అంగీకరించాక తెలుగులో, హిందీలో సైక్లో స్టైయిల్ చేయించాలి. పిల్లల సమాధానాలు రాబట్టాలి."

బేరర్ రాగానే బిల్ తీసుకురమ్మని చెప్పాడు సాంబశివరావు. పర్స్ కోసం ఎడం వైపున్న పాంటు జేబులో చెయ్యిపెట్టాడు.

లేదు.

కొన్ని క్షణాలపాటు ఆలోచించాడు పర్స్ ఏమై వుంటుందా అని.

"పర్స్ వున్న పేంట్ బదులు వేరే పేంట్ యిచ్చావు నువ్వు" చెప్పాడు సాంబశివరావు.

"పర్సులేదా? అడిగింది నీరజ.

తల అడ్డంగా ఊపాడు.

"మీతో వస్తున్నానని నా హేండ్ బేగ్ కూడా తేలేదు. నా దగ్గరా డబ్బులేదు, ఎలా? అడిగింది కంగారుగా.

బేరర్ బిల్ వున్న ప్లేటుతో వచ్చి, దాన్ని టేబుల్ మీద పెట్టి నుంచున్నాడు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకరి మొహం వంక మరొకరు చూసుకున్నారు. బిల్లు చెల్లిస్తేకానీ అక్కడనుంచి కదిలే ఉద్దేశం లేనట్లుగా ఓపికగా చూస్తూ నిలబడ్డాడు బేరర్.

"బేరర్ రెండు కాఫీ తీసుకురా" చెప్పాడు సాంబశివరావు.

"ఐస్ క్రీం తర్వాత కాఫీ ఏమిటి?" అడిగింది నీరజ అయోమయంగా చూస్తూ.

"బిల్లుని కాసేపు ఆపాలనే ఎత్తుతో, నువ్వు హోటల్‌కి వెళ్ళి పర్సు తీసుకురా. అప్పటిదాకా మానేజ్ చేస్తాను. డబ్బు మర్చిపోయాం అంటే ముందు నిన్ను బయటికి కదలనివ్వరు."

"మా ఇంట్లో నేనెప్పుడూ పిండి రుబ్బలేదు మీరు?" అడిగింది నీరజ నవ్వుతూ.

నీరజ లేచి వెళ్ళిపోయాక రెండు కాఫీ కప్పులతో, కొత్త బిల్లుతో వచ్చాడు బేరర్. మళ్ళీ ఓపిగ్గా సాంబశివరావ్ పక్కనే నిలబడ్డాడు. సాధ్యమైనంత ఆలస్యంగానే సాంబశివరావు కాఫీ తాగసాగాడు. మొదటిది పూర్తయ్యాక రెండో కప్పు అందుకున్నాడు. బేరర్ విసుగ్గా చూసి వెళ్ళిపోయాడు.

ఆ కాఫీ పూర్తయిన నాలుగైదు నిముషాలకి వచ్చాడు బేరర్ మళ్ళీ.

"ఒక ప్లేటు ఇడ్లీ " చెప్పాడు సాంబశివరావు బిల్లు అతని చేతిలో పెట్టి.

"ఇడ్లీ"

బేరర్ కనుబొమ్మలు ప్రశ్నార్ధకంగా పైకి లేచాయి వెంటనే.

"అవును."

"రెండు కాఫీ తాగాక?" కన్నడంలో అడిగాడు.

"నాకు కాఫీ తాగాక తినే ఇడ్లీ ఇష్టం" చెప్పాడు సాంబసివరవు తెలుగులో.

ఇడ్లీ పూర్తయ్యాక కూడా నీరజ రాలేదు.

"దోసె" చెప్పాడు సాంబశివరావు, బేరర్‌కి బిల్లు తిరిగి యిచ్చేసి.

బేరర్ చూసిన ఆ చూపు తను జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేడు అనుకున్నాడు సాంబశివరావు. పిచ్చివాడివంక చూసినట్లుగా చూశాడు.

దోసెని ఇరవై నిమిషాలసేపు తిన్నాడు. మధ్య మధ్య గడియారం వంక చూసుకుంటూ. బేరర్ అటువైపు వచ్చినప్పుడల్లా ఓరకంటితో సాంబశివరావుని గమనిస్తూనే ఉన్నాడు.

మళ్ళీ బిల్లుతో వచ్చాడు. ఇంక తన కడుపులో చోటులేదని గ్రహించి చెప్పాడు.

"బిస్లరీ సోడా."

బేరర్ మళ్ళీ ఇందాకటిలాగే చూశాడు వెళ్ళబోయేముందు. ఇప్పుడు తన దగ్గర డబ్బులేదన్న సంగతి బేరర్‌కి తెలిసినట్లుగా గుర్తించాడు సాంబశివరావు. మిగతా బేరర్స్ అంతా సాంబశివరావు వంక గుచ్చి గుచ్చి చూస్తున్నారు. సోడాని మరో పావుగంటసేపు తాగుతూ గడిపాడు సాంబశివరావు. నీరజ వెళ్ళిపోయి అప్పటికే ముప్పావుగంట కావస్తోంది తాము బసచేసిన హోటలునుంచి ఆ రెస్టారెంటుకి వెళ్ళి రావటానికి అరగంట చాలు. ఎందుకు ఆలస్యం అయింది?

బేరర్ మళ్ళీ బిల్లుతో వచ్చాడు.

"ఇంకో ఐస్ క్రీం" చెప్పాడు సాంబశివరావు.

ఈసారి బేరర్ బిల్లు తీసుకెళ్ళలేదు.

మరోసారి చేతిగడియారం వంక చూసుకుని జరిగిన పొరపాటుకి తనని తాను మనసులో తిట్టుకున్నాడు సాంబశివరావు. పర్స్ వుందో లేదో చెక్ చేసుకుని ఉండాల్సింది.

బేరర్, అతనిపక్క ఇన్‌షర్ట్, టైలతో వున్న మరొకతను తనవైపు రావటం సాంబశివరావు చూశాడు.

"ఐస్ క్రీం ఏది?" అడిగాడు సాంబశివరావు బేరర్‌ని బింకంగా.

"ఇంతవరకు అయిన బిల్ చెల్లించండి" చెప్పాడు బేరర్ పక్కనున్నతను ఇంగ్లీష్‌లో.

"మీరెవరు?" అడిగాడు సాంబశివరావు.

"ఈ హోటలు సూపర్‌వైజర్‌ని."

"గ్లాడ్ టు సీయు. నా పేరు సాంబశివరావు. నేను హైదరాబాద్‌లో స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాలో ఆఫీసరుగా పనిచేస్తున్నాను. నాకు పెళ్ళయి వారం కూడా అవలేదు. నిజానికి అయిదు రోజులే అయింది."

"నాకు మీ వివరాలు అనవసరం. దయచేసి బిల్లు పే చెయ్యండి"

"నే చెప్పిన వివరాల్లో ఏదీ అబద్ధం కాదు, నేను నా భార్య కలిసి వచ్చాం"

"బిల్ ప్లీజ్?"

"నే చెప్పేది వినండి."

"మీ దగ్గర డబ్బుందా లేదా?"

"లేదు.. ఐ మీన్ వుంది"

"ఉంటే పే చెయ్యండి." "ఇప్పుడు లేదు. కాస్సే..."

"నేను పోలీసులకు ఫిర్యాదు చెయ్యాల్సి వుంటుంది" కఠినంగా చెప్పాడు సూపర్ వైజర్.

"లుక్ హియర్ జెంటిల్మన్... ఎంతయింది బిల్లు?"

నీరజ కంఠం విన్నాక ప్రాణం లేచొచ్చినట్టు అయింది.

ఇద్దరివంకా కొరకొరా చూస్తూ, నీరజ అందించిన పర్స్ తెరిచి యాభై రూపాయల నోట్ తీసి ప్లేటులో పడేశాడు. మరుక్షణంలో ఇద్దరూ వెళ్ళిపోయారు.

చిన్నగా నిట్టూర్చి చెప్పాడు నీరజతో - "నువ్ ఇంకాస్త ఆలస్యం చేసివుంటే ఇంత బతుకు బతికి జైల్లో కలుసుకునేవాళ్ళం, వీళ్ళ సైకాలజీ అర్థం చేసుకోదు నువ్వు."

"వస్తూ హోటలు దారి తప్పాను. వెదుకుతుంటే లక్కీగా కనపడింది."

"అది నీ లక్ కాదు. నా లక్. పద పోదాం. రెండు రోజులదాకా టిఫెన్, భోజనం అవసరం వుండదు నాకు" చెప్పాడు సాంబశివరావు లేవడానికి ఆయాసపడుతూ.

రైలు బయలుదేరిన పది, పదిహేను నిమిషాలదాకా రాజేష్ కిటికిలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. రాజేష్ జీవితంలో రైలు ప్రయాణం అది రెండో అనుభవం. ఒంటరి ప్రయాణం మాత్రం మొదటి అనుభవం.

"హైదరాబద్ ఎవరింటికి బాబు?" అడిగాడు ముసలాయన ముచ్చటగా వున్న రాజేష్‌ని.

"మా తాతయ్య దగ్గరకి" చెప్పాడు రాజేష్.

"మీ తాతయ్య ఏం చేస్తుంటారు?"

"ఏమో?" ఈసారి కూడా కిటికీలోంచి బయటికి చూస్తూనే జవాబు చెప్పడు. కాసేపాగి చెప్పాడు ఉత్సాహంగా.

"సర్కస్ కంపెనీ నడుపుతారు."

"సర్కస్ కంపెనీనా?"

"అవును. మా తాతయ్యకు పులులన్నా, సింహాలన్నా భయంలేదు మా సర్కస్ నిండా అవే"

రాజేష్ తన చేతి రుమాలుని తీసుకుని ఓసారి కన్నీళ్ళు కారకుండా తుడుచుకున్నాడు. రుమాలులోని టిక్కెట్ కింద పడింది. సీటు మీంచి దిగి, తీసుకుని టిక్కెట్‌ని భద్రంగా రుమాలు మడతల్లో వుంచి, ఆ రుమాలుని తన సీటు మీద ఉంచాడు.

"సింహం గుహలోకి వెళ్ళి మళ్ళీ ప్రాణాలతో బయటకు ఎవరొస్తారో చెప్పగలరా?" అడిగాడు రాజేష్ ముసలాయన్ని.

ఆయన బుర్ర గోక్కుని తన భార్యవంక చూశాడు. ఆవిడ కూడా ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయింది. ఆ ప్రశ్న విన్న మిగతావాళ్ళు కూడా ఆలోచించారు.

"ఏనుగు?" సందిగ్ధంగా జవాబు చెప్పాడు ముసలాయన.

"ఏనుగెక్కడయినా సింహం గుహలో పడుతుందా?"

"ఎవరు?" అడిగాడాయన.

"సింహం వుండే గుహలోకి వెళ్ళి, మళ్ళీ ప్రాణాలతో బయటకి వచ్చేది సింహమే" చెప్పాడు రాజేష్ నవ్వుతూ.

ఆ జవాబుకి అంతా సన్నగా నవ్వారు.

"మా అమ్మ ఇంకా ఇలాంటివెన్నో బోలెడు చెపుతూవుంటుంది" చెప్పాడు రాజేష్.

"టిక్కెట్ ప్లీజ్! టిక్కెట్" టిక్కెట్ కలెక్టరు వచ్చాడు. అంతా తమ తమ టిక్కెట్స్ తీసి సిద్ధంగా పట్టుకున్నారు. టిక్కెట్ తనిఖీ చేసి, దానిమీద సంతకం చేసి ఇస్తున్నాడు టి.సి.

రాజేష్ సీటుమీద పెట్టిన చేతి రుమాలు అందుకుని, దాని మడతలు విప్పాడు. రుమాలు పూర్తిగా విప్పాడు. కానీ, మడతల్లో ఉంచిన టిక్కెట్ కనపడలేదు. సీటుమీద చూశాడు. లేదు. దిగి సీటు కింద చూశాడు కింద పడిందేమోనని. లేదు.

చొక్కా జేబులో చూసుకున్నాడు. లాగు జేబుల్లో చూసుకున్నాడు. మరోసారి కింద చూశాడు. రుమాలుని అటూ ఇటూ తిప్పి చూశాడు. సీటు మీద చూశాడు.

"టిక్కెట్ ఏది?" అడిగాడు టి.సి.

"టిక్కెట్ కొన్నానండీ" బిక్కమొహం వేసుకుని చెప్పాడు రాజేష్.

"కొంటే చూపించు."

"ఇంతదాకా నా దగ్గరే ఉందండి. ఇప్పుడే ఎటో పడిపోయిందండి."

టి.సి రాజేష్‌ని ఎగాదిగా చూసాడు.

"ఎక్కడ పడిపోతుంది?" కసిరాడు.

రాజేష్ మరోసారి వెదికాడు అన్నిచోట్లా. టిక్కెట్ కనపడలేదు.

"హాఫ్ టిక్కెట్ కొన్నానండి. ఎటో పడిపోయింది."

"ఒక్కడివే వెళుతున్నావా?" అనుమానంగా చూస్తూ అడిగాడు టి.సి గద్దిస్తూ.

అవునన్నట్లుగా తల వూపాడు రజేష్.

"ఇంట్లో చెప్పే వెళుతున్నావా? పారిపోతున్నావా?"

"మా అమ్మే నన్ను మా తాతయ్య దగ్గరికి పంపిస్తోందండీ."

"టిక్కెట్ కొనివ్వకుండానా?" వెటకారంగా అడిగాడు.

"మదర్ డెడ్ ప్రామిస్. కొనిచ్చిందండి."

"నిజమే ఆ అబ్బాయి వాళ్ళమ్మ టిక్కెట్ ఇచ్చి జాగ్రత్తగా వుంచమని చెప్పింది" ముసలావిడ కల్పించుకుంది.

"రైల్లో టిక్కెట్ రైల్లో ఎలా మాయమవుతుంది?" అడిగాడు టి.సి విసుగ్గా.

ఆ ప్రశ్నకి ఎవరి దగ్గరా సమాధానంలేదు. మౌనంగా వుండిపోయారు.

"నీ దగ్గర డబ్బెంత వుంది అబ్బాయ్?" అడిగాడు టి.సి.

"రెండు రూపాయలున్నాయ్" బితుకు బితుకుమంటూ చూస్తూ చెప్పాడు రాజేష్. పరాయివాళ్ళ ముందు అలా భయపడుతూ నిలబడటం రమేష్‌కు అది తొలి అనుభవం.

"నిజం చెప్పు టిక్కెట్ కొనలేదు కదూ?" గట్టిగా అడిగాడు టి.సి.

"దొంగ రాస్కెల్‌లా వున్నాడు చూస్తూంటే" అంతదాకా మౌనంగా పేపర్ తిరగేస్తూ రాజేష్ పక్కన కూర్చున్న వ్యక్తి చెప్పాడు.

అతను పేపర్ అడ్డం తీయడంవల్ల అంతా అతని మొహం వంక చూశారు.

"జువెనైల్ డెలిన్‌క్వెంట్‌లా వున్నాడు" అతని కళ్ళలో రాజేష్ మీద వున్న ద్వేషాన్ని పసికట్టారు చాలామంది.

"మీరా? మీరు చెప్పండి అంకుల్. ఇందాక నేను మీ ముందు క్యూలో నిలబడి సికింద్రాబాద్‌కి టిక్కెట్ కొన్నాను కదా?" అడిగాడు రాజేష్ ఆ పొడుగాటి బుర్రమీసాల వ్యక్తిని.

"నువ్వు టిక్కెట్ కొనగా నేను చూడలేదు" చెప్పాడతను.

రాజేశ్‌కి ఏడుపు తన్నుకు వస్తోంది. బలవంతంగా నిగ్రహించుకుంటూ అన్నాడు టి.సితో "టిక్కెట్ పోవటం నిజం సర్."

టి.సి రాజేష్ మెడ పట్టుకుని ప్రక్కకి లాగుతూ అన్నాడు - "ఈ వయసులోనే నేర్చుకున్నావురా నా కొడకా! చెప్తా రా"

"అదేంటి బాబు ఆ మాటలు?" అడిగాడు  ముసలాయన టి.సి.ని.

టి.సి ఆయన్ని తీక్షణంగా చూసి అడిగాడు.

"ఏం ఈ దొంగ వెధవ టిక్కెట్ మీరు కొంటారా?" అడిగాడు.

ముసలాయన మరి మాట్లాడలేదు. రాజేష్‌కి అందరి ముందూ ఏడవటం సిగ్గుగా అనిపించింది. బాత్‌రూం వైపు నడవబోయాడు. కాలర్ పట్టుకుని ఆపి గద్దించాడు టి.సి.

"పారిపోదామనుకుంటున్నావ్‌రా లొట్టి వెధవ."

"బాత్ రూంకి"

"బాత్ రూం లేదు. గీత్ రూం లేదు."

రాజేష్ కళ్ళలోంచి నీరు కారలేదు. తల్లి ఇచ్చిన శిక్షణ వల్ల కంట్లో నీరు కంట్లోనే ఆపుకున్నాడు. కన్నీళ్ళు ఆపుకుని ఏడుస్తున్నాడు.

రైలు వేగం తగ్గింది. రైలు క్రమంగా ఆగింది. వంగి కిటికీలోంచి చూశాడు టి.సి సిగ్నల్ దగ్గర ఆగిందేమోనని.

"దిగు."

గుమ్మం వైపు తోశాడు టి.సి.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in